ఆర్టీసీ ప్రయాణికులకు గులాబీతో కృతజ్ఞతలు

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 15: ఆర్టీసీ మర్యాద దినోత్సవం సందర్భంగా బస్సుల్లో ప్రయాణికులకు సిబ్బంది గులాబీ పువ్వులు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఘట్‌కేసర్ బస్‌స్టేషన్ ఆవరణలో ప్రయాణికులకు చెంగిచెర్ల డిపో డిప్యూటీ సూపరింటెండెంట్ అరుణలక్ష్మి గులాబీ పూలు అందించి కృతజ్ఞతలు తెలిపారు. ప్రయాణికులే సంస్థకు దేవుళ్లని వారికి విశిష్ట సేవలందించేందుకు ఉద్యోగులు కృషి చేస్తున్నట్లు చెప్పారు.

వైన్స్‌లో చోరీ

మేడ్చల్, నవంబరు 15 : మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం దుకాణంలో చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ పారిశ్రామిక వాడ చెక్‌పోస్టు వద్ద రేణుకా ఎల్లమ్మ తిరుమల వైన్స్‌లోకి గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. రూ. 8 వేల నగదు, మద్యం బాటిళ్లను అపహరించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివయ్య అనుగ్రహం అందరిపై ఉండాలి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి
- అంతటా.. కార్తిక పౌర్ణమి పూజలు, వ్రతాలు

మల్లాపూర్, నవంబర్ 15 : శివుడి అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. కార్తిక పౌర్ణమిని పురస్కరించుకొని శుక్రవారం మల్లాపూర్ డివిజన్ నందీశ్వర ఆలయంలో ఆయన కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రజలు సుఖశాంతులతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, అన్న ప్రసాద దాతలు శ్రీనివాస్ కృష్ణవేణి, జోగు వీరేశ్ విజయలక్ష్మి, జోగు వెంకటేశ్, వర్ష, ఆలయ కమిటి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చీర్యాల్ శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాలు

కీసర : చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయం కార్తికశోభను సంతరించుకుంది. శుక్రవారం ఉదయం నుంచే భక్తులు భారీగా ఆలయానికి చేరుకుని స్వర్ణపుష్పాలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ఆలయం వారు పూర్తి సామగ్రిని అందజేశారు. ఆలయ చైర్మన్ మల్లారపు లక్ష్మీనారాయణగౌడ్, ఆలయ ధర్మకర్త శ్రీహరిగౌడ్ కార్తికదీపాలను వెలిగించారు.

నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో..

మేడ్చల్ కలెక్టరేట్ : నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో శుక్రవారం భక్తులు కార్తిక పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నాగారం సత్యనారాయణ కాలనీలో కొలువైన శ్రీ రమాసత్యనారాయణ స్వామి, శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో అభిషేకాలు, సుదర్శన సహిత ఆయుష్ హోమము, శ్రీ రమా సత్యనారాయణస్వామి కల్యాణం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, మధ్యాహ్న హరతి, జ్వాలాతోరణం తదితరములు, శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి వారి సామూహిక వ్రతాలను నిర్వహించారు. శ్రీమహా గురుసేవా సమితి హైదరాబాద్ వారిచే 207వ నెల చండీహవనం, మహాపూజ, కార్తిక దీపోత్సవం, జ్వాలా తోరణం నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు రవి మూర్తి శర్మ, కిరణ్ ఆచార్యులు, హరి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. ఆలయ ఈఓ కృష్ణమాచార్యులు, శ్రీనివాస్ గౌడ్, ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ సీఆర్ రామకృష్ణారావు, మహేశ్‌గౌడ్, అశోక్‌గౌడ్, కుమార్, గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

మల్లాపూర్ : నందీశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్‌రెడ్డి తదితరులు

చీర్యాల్ శ్రీ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న భక్తులు

మేడ్చల్ కలెక్టరేట్ : నాగారం శ్రీ రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న సుదర్శన సహిత ఆయుష్ హోమం

శామీర్‌పేట : రమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో సత్యనారాయణ స్వామి వత్రాలు చేస్తున్న భక్తులు

మేడ్చల్ కలెక్టరేట్ : సత్యనారాయణ కాలనీలో శ్రీ రమా సత్యనారాయణస్వామి వ్రతాపాల్గొన్న భక్తులు

కాప్రా పరిధిలో..

కాప్రా : కాప్రాలో కార్తిక పౌర్ణమి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో ప్రత్యేక పూజల్లో పాల్గొని కార్తిక దీపాలు వెలిగించారు. కాప్రా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో ఉమామహేశ్వర స్వామి వారికి రుద్రాభిషేక పూజలు కనుల పండువగా నిర్వహించారు.

కాప్రా శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాల్లో పాల్గొన్న భక్తులు



మేడ్చల్ రూరల్ : గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో దీపాలను వెలిగిస్తున్న మున్సిపల్ కౌన్సిలర్, భక్తులు

కీసరగుట్టలో భక్తిశ్రద్ధలతో కార్తిక వేడుకలు

- పూజల్లో లక్షలాదిగా పాల్గొన్న భక్తులు
- దీపారాధన

కీసరగుట్టలో స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో వస్తున్న భక్తులు

కీసర, నవంబర్ 15; కార్తికపౌర్ణమి సందర్భంగా శుక్రవారం కీసరగుట్టకు భక్తులు భారీ ఎత్తున తరలివచ్చారు. తెల్లవారుజామున 3 గంటలకు ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, వంశపారంపర్య ధర్మకర్తలు గర్భాలయంలో మూలవిరాట్‌కు మొదటి పూజ, అభిషేకం నిర్వహించారు.అనంతరం తేనే, ఆవుపాలు, పంచామృతంతో ప్రత్యేక మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం గావించారు. ఒకవైపు శివనామస్మరణం, మరోవైపు సత్యనారాయణ వ్రతాలు, కార్తిక దీపాలు వెలిగించడం, శివలింగాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడంతో కీసరగుట్ట భక్తులతో కొలహలంగా మారింది. క్యూలైన్లలో శివనామస్మరణ చేసుకుంటూ స్వామి వారిని దర్శించుకున్నారు. పోలీసుల భద్రతను పర్యవేక్షించారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అక్కడి నుంచి నేరుగా కాశీ విశ్వేశ్వరాలయం, శ్రీ లక్ష్మీనర్సింహస్వామి, నాగదేవత ఆలయాలను దర్శించుకున్నారు.

వైభవంగా కార్తిక దీపారాధన

కార్తిక పౌర్ణమి కావడంతో భక్తులు ఆలయం పక్కనే ఏర్పాటు చేసిన ప్రదేశంలో కార్తిక దీపాలను వెలిగించారు. ఆలయం ముందున్న ధ్వజస్తంభం, శివలింగాల వద్ద దీపాలను వెలిగించారు.

శివలింగాలకు అభిషేకాలు

ఆలయ రాజగోపురం ముందున్న శివలింగాలకు భక్తులు పాలు, నెయ్యి, తేనె, పెరుగుతో అభిషేకాలను నిర్వహించారు. కార్తిక దీపాలను వెలిగించి వాటి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కల్గకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ తటాకం నాగలింగంశర్మ, ఈఓ కట్టా సుధాకర్‌రెడ్డి తెలిపారు. సుమారు 2.50లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు పేర్కొన్నారు. ప్రత్యేక దర్శనం, ధర్మదర్శనం, ప్రత్యేక అభిషేకాల క్యూలైన్లలో భక్తులు ఇబ్బంది పడకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

గుట్టపై కార్తిక దీపాలను వెలిగిస్తున్న భక్తులు

క్రైస్తవ సంక్షేమానికి కృషి చేస్తా.. : దీపక్‌జాన్

రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్‌ను సత్కరిస్తున్న క్రైస్తవ ప్రతినిధులు

ఉప్పల్, నవంబర్ 15 : క్రైస్తవుల సంక్షేమానికి తనవంతుగా కృషి చేస్తానని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్ అన్నారు. శుక్రవారం ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని హోరేబు ప్రేయర్ హౌజ్ మినిస్ట్రీస్ చర్చి వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ గోన ఫిలిప్, పాస్టర్ గోన అనిల్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తామన్నారు. సబ్సిడీ రుణాలు త్వరలోనే ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిషప్ ఆశీర్వాదం, ప్రభుచరణ్, రమేశ్, అగ్రప్ప రాజు, జాన్ ముల్లర్, కృపాకర్, దేవదానం, రవిచంద్ర, బిషప్ ఆనంద్, రవీంద్రరెడ్డి, డేవిడ్, కుమార్, దయానంద్, జెరుసలేము మత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సమస్యలు పరిష్కరిస్తాం.. కార్పొరేటర్

వాయుపురి మెయిన్‌రోడ్డులో వాహనాల అక్రమ పార్కింగ్‌ను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్ నరసింహ, కార్పొరేటర్ రాజ్యలక్ష్మి

మల్కాజిగిరి, నవంబర్ 15: ట్రాఫిక్ సమస్యలను పరిష్కరిస్తామని వినాయక్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ క్యానం రాజ్యలక్ష్మి అన్నారు. శుక్రవారం వాయుపురి మెయిన్ రోడ్డుపై, కాకతీయనగర్ మెయిన్ రోడ్డులో వ్యాపారులు అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దాంతో ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నరసింహతో కలిసి కార్పొరేటర్ పర్యటించి సమస్యను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా ట్రాఫిక్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారని, రూల్స్‌ను ఉల్లంగించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఓంప్రకాష్, మల్లేశ్‌యాదవ్, సాయిసురేశ్, శ్రీకాంత్, వెంకటేశ్, జగదీశ్‌చారి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్కులను సుందరీకరిస్తాం.. : కార్పొరేటర్

జీకేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీ పార్కులో బోర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న కార్పొరేటర్ జితేంద్రనాథ్

మల్కాజిగిరి, నవంబర్ 15: పార్కులను సుందరీకరిస్తామని మచ్చ బొల్లారం డివిజన్ కార్పొరేటర్ జితేంద్రనాథ్ అన్నారు. శుక్రవారం జీకేఆర్ ఎన్‌క్లేవ్ కాలనీలోని పార్కులో పవర్ బోర్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జితేంద్రనాథ్ మాట్లాడుతూ.. డివిజన్‌లోని పార్కుల్లో ల్యాండ్‌స్కేప్ గార్డెన్స్, వాకింగ్ ట్రాక్, పిల్లల ఆట పరికరాలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో హర్టికల్చర్ ఆఫీసర్ నవీన్, నికోలిస్, జలంధర్, శ్రీమాన్, ఆశిష్, అరుణ్, సురేందర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, రమేశ్, ఆనంద్, దేవేందర్, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కనకదుర్గకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

చర్లపల్లి, నవంబర్ 15 : సీఎం రిలీఫ్ ఫండ్‌ను పేదలు సద్వినియోగం చేసుకోవాలని చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి డివిజన్ విద్యామారుతినగర్‌కు చెందిన కనకదుర్గ అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందింది. ఆమెకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 40వేల చెక్కును కార్పొరేటర్ అందజేసి మాట్లాడారు. పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరక్టర్ నాగిళ్ల బాల్‌రెడ్డి, నాయకులు ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

మేడ్చల్, నవంబర్ 15 : చెట్టుకు ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన దీపక్‌లాల్‌సింగ్(20) మేడ్చల్‌లో నివాసం ఉంటూ పారిశ్రామిక వాడలో ఉన్న సమ్మక్క, సారక్క కంపెనీలో కూలీగా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మేడ్చల్ మండలం రావల్‌కోల్ పరిధిలో గురువారం రాత్రి చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికుల సమాచారం ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు దీపక్‌లాల్ సింగ్‌ను గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా దీపక్‌లాల్ సింగ్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ లీకై ఒకరికి గాయాలు

మల్కాజిగిరి, నవంబర్ 15: ఫాస్ట్ ఫుడ్ సెంటర్‌లో గ్యాస్ లీకై ఒకరికి గాయాలైన సంఘటన అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై మహేశ్ కథనం ప్రకారం.. హస్మత్‌పేటలోని మెయిన్ రోడ్డులోని ఆల్ స్పైసీ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో వంట చేస్తుండగా అకస్మాత్‌గా సిలిండర్ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగడంతో యజమాని అప్సర్(30)కి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన హోటల్ సిబ్బంది మంటలను ఆర్పివేశారు. చికిత్స కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ దవాఖానకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి అదృశ్యం

సంతోష్

జవహర్‌నగర్, నవంబర్ 15: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. కాప్రా మండలం ఎల్లారెడ్డిగూడలో సంగ సంతోష్(32) భార్య నవనిత, కుమారుడు లవన్, అత్తామామలతో కలిసి నివాసముంటున్నారు. 2009లో ప్రేమ వివాహం చేసుకున్న సంతోష్ ఈనెల 13న ఇంట్లో బట్టలు సర్దుకుని వెళ్లి తిరిగిరాలేదు. సంతోష్ పనిచేసే దుకాణానికి వెళ్లి ఉంటాడని భావించిన కుటుంబసభ్యులు యజమానిని సంప్రదించగా 7వ తేదీ నుంచి షాపునకు రావడంలేదని చెప్పాడు. దీంతో పరిసరాల్లో వెతికి, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేకపోయింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

చర్లపల్లి రైల్వే టెర్మినల్‌లో కార్మికులను సమస్యలడిగి తెలుసుకుంటున్న రవీందర్

చర్లపల్లి, నవంబర్ 15 : రైల్వే కార్మికుల సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు రైల్వే మజ్దూర్ యూనియన్ కృషి చేస్తుందని సికింద్రాబాద్ బ్రాంచి యూనియన్ ప్రధాన కార్యదర్శి రవీందర్ పేర్కొన్నారు. దక్షణ మధ్య రైల్వే ఎన్నికల్లో భాగంగా ఘట్‌కేసర్ బ్రాంచ్ పరిధిలోని చర్లపల్లి, మౌలాలి రైల్వే స్టేషన్లలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించి కార్మికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవిందర్ మాట్లాడుతూ.. రైల్వే కార్మికులకు పెన్షన్ అందించేందుకు యూనియన్ కృషి చేస్తుందన్నారు. ఎనిమిది గంటల పని విధానం అమలు, రైల్వేలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. వచ్చే నెల డిసెంబర్ 4,5,6 తేదీల్లో నిర్వహించే ఎన్నికల్లో కార్మికులు పాల్గొన్నాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సికింద్రాబాద్ ఏడీఎస్ చిలుకస్వామి, ఘట్‌కేసర్ బ్రాంచి కార్యదర్శి బొల్లెపల్లి శ్రీనివాస్, బ్రాంచి చైర్మన్ విజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, దిలీప్‌కుమార్, ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఫీల్డ్ ట్రిప్

ఉప్పల్, నవంబర్ 15 : నాచారంలోని డెక్కన్ స్పింగ్స్ గ్లోబల్ స్కూల్ విద్యార్థులకు ఫీల్డ్ ట్రిప్ నిర్వహించారు. బాలల దినోత్సవంలో భాగంగా కార్నివాల్, మూవీ స్క్రీనింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల చైర్మన్ నవనీతరావు, ఎండీ నవీన్‌కుమార్, కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సుమ మీనన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్‌కు ఆర్థిక సాయం

మల్కాజిగిరి, నవంబర్ 15: జర్నలిస్ట్‌లకు అండగా ఉంటామని మల్కాజిగిరి సర్కిల్ బీఆర్ఎస్ నాయకుడు రాముయాదవ్ అన్నారు. ప్రమాదంలో గాయపడి ఈసీఐఎల్‌లోని ప్రైవేటు దవాఖనలో చికిత్స పొందున్న జర్నలిస్ట్ లక్ష్మారెడ్డిని శుక్రవారం రాముయాదవ్ పరామర్శించి రూ.15వేల ఆర్థిక సాయం అందజేశారు.

నిరంతర తాగునీటి సరఫరాకు చర్యలు

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తున్న చైర్‌పర్సన్ పావనీజంగయ్య యదవ్

ఘట్‌కేసర్ రూరల్, నవంబర్ 15 : నిరంతర తాగునీటి సరఫరా లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనీజంగయ్య యాదవ్ తెలిపారు. ఘనపూర్, పకీర్ టెక్యా గ్రామాలకు కృష్ణా నీటి పైపులైన్ మరమ్మతుల కారణంగా తాగునీటి సరఫరా నిలిచిపోవడంతో విషయం తెలుసుకున్న చైర్‌పర్సన్ వెంటనే మరమ్మతులు చేయించారు. అనంతరం గ్రామస్తుల కోరిక మేరకు బోరు వేయించడంతో పాటు విద్యుత్ సమస్యలేకుండా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరాల అయ్యప్ప ఆలయంలో వార్షికోత్సవాలు

కీసర, నవంబర్ 15; కీసరలోని శ్రీ హరిహరపుత్ర వరాల అయ్యప్పస్వామి దేవస్థానంలో వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం కేరళ తాంత్రిక ఆచార్యన్ బ్రహ్మశ్రీ కె. ప్రదీప్‌కుమార్ తంత్రి ఆధ్వర్యంలో ఘనంగా ప్రారంభ మయ్యాయి. గణపతిహోమం, కోడియాట్టం పూజ, నవకం, పంచాంగవ్యం వంటి వేడుకలను కేరళ సంప్రదాయం ప్రకారం నిర్వహించారు. అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. నెల రోజుల పాటు ఈ వేడుకలను నిర్వహిస్తామని ప్రదీప్‌కుమార్ తంత్రి తెలిపారు. గురుస్వాములు బాల్‌రెడ్డి, మహేందర్, శంకర్‌గౌడ్, జంగయ్యయాదవ్, రమేశ్‌యాదవ్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్కాజిగిరి, నవంబర్ 15: మల్కాజిగిరి, అల్వాల్ సర్కిళ్ల పరిధిలోని 11కేవీ భరత్‌నగర్, వాజ్‌పేయినగర్, సంతోష్‌నగర్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10.30 నుంచి 3.30 గంటల వరకు, 11.00 నుంచి 4.30 గంటల వరకు పలు కాలనీల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

- కీసర : 11 కేవీ కరీంగూడ విద్యుత్ పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈ మురళీ కృష్ణ తెలిపారు.
- ఘట్‌కేసర్ : పోచారం మున్సిపాలిటీ పరిధిలోని నారపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఈనెల 16 శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ వి.ప్రదీప్ కుమార్ తెలిపారు
- మేడ్చల్ కలెక్టరేట్: విద్యుత్ మరమత్తుల కారణంగా శనివారం బండ్లగూడ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు నాగారం ఏఈ రాజేంద్రప్రసాద్ తెలిపారు.
- శామీర్‌పేట : సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ నల్సార్, 11 కేవీ ఎన్‌టీఆర్‌వో ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 10:30 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాఘవేందర్‌రావు తెలిపారు.
- ఉప్పల్ : రాంరెడ్డినగర్, వెంకట్ రెడ్డినగర్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏఈలు తెలిపారు.
- మల్లాపూర్ డివిజన్ 11కేవీ నోమా ఫీడర్ పరిధిలో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4:30 వరకు..
- కాప్రా : మౌలాలి సబ్‌స్టేషన్ వెంకటేశ్వరనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ తెలిపారు.